సాక్షి విజయనగరం

గురువారం, 16, అక్టోబర్, 2025



మత్తులో ఉంచి వైద్యం

వైద్యరంగంలో కొన్నేళ్ల క్రితం వరకు మత్తు వైద్యుల గురించి ప్రజలకు పెద్దగా తెలియదు.

- 10లో



గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్ట్

- 10లో

గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను విజయనగరం జీఆర్పీ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు.

నేడు 'డయల్ యువర్ డీపీటీఓ'

విజయనగరం అర్బన్: ప్రయాణికుల సమస్యల పరిష్కారం, సూచనల స్వీకరణ కోసం గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీపీటీఓ' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి (డీపీటీఓ) వరలక్ష్మి తెలిపారు. సమస్యలను 99592 25604 ఫోన్ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. ప్రయాణికులకు ఎదురవుతున్న సమస్యలు, సేవల మెరుగుదలకు సంబంధించిన సూచనలను తెలియజేయాలన్నారు.

న్యూస్‌రీల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సాక్షి ఎఫెక్ట్...

బొబ్బిలి: జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మొక్కజొన్న, పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'అమ్ముకోలేక.. ఉంచుకోలేక' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. విజయనగరం, నెల్లిమర్ల, గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట, రాజాం, బొబ్బిలి మండలాల్లో ఈ ఏడాది సుమారు 7వేల హెక్టార్లలో మొక్కజొన్న పండించారని, ప్రస్తుతం మొక్కజొన్న గింజలు క్వింటా రూ.1900 నుంచి రూ.2100 మధ్యన ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు సరైన మద్దతు ధర లభించాలనే ఉద్దేశంతో విజయవాడలోని ఎం.డి.దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే మొక్కజొన్న గింజలను క్వింటా రూ.2400కు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.

వైద్య కళాశాల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి



కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: వైద్య కళాశాలలో నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత భవనాల నిర్మాణ పరిస్థితి, ఆస్పత్రి భవనం, హాస్టల్ భవనాల నిర్మాణంపై ఆరా తీశారు. ఇప్పటివరకు జరిగిన పనులు, మొత్తం పనులు పూర్తి కావడానికి ఎంత సమయం పడుతుందన్న అంశాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలన్నారు. సర్వజన ఆస్పత్రి లోపల రహదారి నిర్మాణానికి, ఆస్పత్రి మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ భారతిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీమాధవి, సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఫైలేరియా యూనిట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ వరుణ్

విజయనగరం ఫోర్ట్: ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ వరుణ్ వైద్యాధికారులను ఆదేశించారు. విజయనగరం పట్టణంలోని ఫైలేరియా యూనిట్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వ్యాధిగ్రస్తులు జీవితకాలంలో డీఈసీ మాత్రలు ఒకసారి వాడితే సరిపోతుందన్నారు.రోజూ క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయడం ద్వారా ఫైలేరియా నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో డీఎంఓ వై.మణి, సీనియర్ ఎంటమాలజిస్ట్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

విజయనగరం: వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతంలో భాగంగా విజయనగరం జిల్లాలో నూతన నియామకాలు చేపట్టినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పతివాడ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గొర్లె రవికుమార్, శంబంగి వేణుగోపాలనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.చిన్నంనాయుడు నియామకం అయ్యారు. విజయనగరం నగరపార్టీ ఉపాధ్యక్షుడిగా రెడ్డి గురుమూర్తి, అవనాపు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శులుగా అల్లు చాణిక్యం, కర్రి రాఘవరెడ్డి, బొత్త యాదవకుమార్, జె.శ్రీనివాసరావు, ఆడారి నాగేశ్వరరావు, బోడసింగి ఈశ్వరరావు నియామకమయ్యారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

నెల్లిమర్ల: ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌జేడీ టి.శేఖర్‌బాబు అన్నారు. స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆర్‌జేడీ టి.శేఖర్‌బాబు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పరీక్షల సంసిద్ధత, అధ్యాపకుల బోధన విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధంచేసి ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి తవిటినాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారి మృతదేహం వద్ద విషణ్ణవదనంలో కుటుంబ సభ్యులు, మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఈ చావుల పాపం ఎవరిది?



ముక్కుపచ్చలారని చిన్నారులు.. పసిమోము ఇంకా వీడని ఛాయలు.. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు.. ఒకరిద్దరు మినహా.. దాదాపు అందరూ గిరిబిడ్డలే.. కొందరికి లేకలేక కలిగిన సంతానం. బిడ్డల కోసం ఆ అమ్మానాన్నలు తిరగని ఊరు లేదు.. మొక్కని దేవుడూ లేదు. అందుకే ఆశలన్నీ వారి మీదే. పంచ ప్రాణాలూ వారిపైనే. చిన్నపాటి జ్వరమొచ్చినా కన్నపేగులు విలవిలలాడిపోతుండేవి. అలాంటిది.. నిన్నమొన్నటి వరకూ ఆడిపాడుతూ వాకిలంతా కలియతిరిగే ఆ చిట్టి పాదాలు.. చదువుకోసం వెళ్లి అనారోగ్యంతో ఒక్కసారిగా మాయమైపోతే... ఆ నవ్వుల సవ్వడి ఆగిపోతే.. కన్నబంధం చూసి తట్టుకోగలదా! ఆ గుండెలు బద్దలైపోక ఉండగలవా!! ఒకరా, ఇద్దరా.. ఏడాదిన్నర కాలంలో 15 మంది చిన్నారులు పార్వతీపురం మన్యం జిల్లాలోనే మృతి చెందడం చిన్న విషయమేమీ కాదు. ఈ చావుల పాపం ఎవరిది? పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను గాలికొదిలేసి, సురక్షిత తాగునీరు కూడా ఇవ్వలేని కూటమి ప్రభుత్వానిదా..? ప్రతి దానికీ రాజకీయాలను ముడిపెట్టి, పిల్లలకు దక్కాల్సిన సౌకర్యాలను నిర్లక్ష్యంగా వదిలేసిన పాలకులదా..? ఒక ఆర్వో ప్లాంటు పని చేయకపోయినా, రోజుల తరబడి వదిలేసిన పాఠశాల సిబ్బందిదా..? మలినం కలిసిన నీరు తాగి, మురుగునీటి మధ్యే ఆడిపాడి, అసౌకర్యాల నడుమే సేద తీరుతున్న విద్యార్థులను కనీసం పట్టించుకోని, పర్యవేక్షణ చేయని అధికారులదా? ఓ వైపు పచ్చకామెర్లు, రక్తహీనత, జ్వరాల రక్కసి కబలిస్తున్నా.. కనీస వైద్యం చేయలేని నిస్సహాయతదా? ఎవరిని నిందించాలి.. ఎవరికి శిక్ష వేయాలి?

– సాక్షి, పార్వతీపురం మన్యం/కురుపాం/గుమ్మలక్ష్మీపురం/మక్కువ



అనారోగ్యంతో ఇటీవల కాలంలో మరణించిన చిన్నారులు వరుసగా.. మండంగి గౌతమ్, నిమ్మల అవంతి, పువ్వల అంజలి, తోయక కల్పన, నిమ్మక జీవన్ కుమార్ (ఫైల్)

మరణాలకు అంతం లేదా...

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవు. ఫలితమే కురుపాం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఓ పువ్వల అంజలి.. ఒక తోయక కల్పన.. సాలూరు నియోజకవర్గంలో కేజీబీవీ విద్యార్థిని బిడ్డిక కీర్తన.. ఈ చావుల పరంపర వీరితో ఆగిపోలేదు. నిన్న కాక మొన్న మూడో తరగతి విద్యార్థిని శాంత.. తాడంగి పల్లవి.. ఇప్పుడు అభంశుభం ఎరుగని బాలుడు, మక్కువ మండలం మూలవలస గ్రామవాసి, ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదుతున్న విద్యార్థి తాడంగి చిన్నారి. ఇలా.. ఏడాదిన్నర కాలంలో పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, ఇతర విద్యాసంస్థల్లో చదువుతున్న 15 మంది విద్యార్థులు అనారోగ్య సమస్యలతో ప్రాణాలు విడిచారు. మండంగి గౌతమ్, నిమ్మల అవంతి, పత్తిక దినేష్, నిమ్మక నితిన్, నిమ్మక జీవన్ కుమార్ తదితర విద్యార్థుల మరణాలతో మన్యం వణికిపోతున్నా ప్రభుత్వం చలించడం లేదు. కురుపాం బాలికల గురుకుల పాఠశాలలో 611 మంది విద్యార్థినులకు ఒకే ఏఎన్ఎం సేవలందిస్తున్నారంటే.. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటూ గిరిజన, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యార్థి చిన్నారి మృతదేహం వద్ద బుధవారం ఆందోళన చేశాయి. చిన్నారి మృతికి సమాధానం చెప్పాలంటూ ఐటీడీఏ అధికారులను, జిల్లా యంత్రాంగాన్ని, పాలకులను ప్రశ్నించాయి. చిన్నారి తల్లిదండ్రులు తాడంగి ముగిరి, కాంతమ్మ కన్నీటి రోదన వినాలని, చావులకు అంతం పలకాలంటూ నినదించాయి. మంత్రి సంధ్యారాణి తీరును ఎండగట్టాయి. రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.



పల్లవి మృతదేహం (ఫైల్)



పత్తిక దినేష్ (ఫైల్)



నిమ్మక నితిన్ (ఫైల్)

ఆ పాపం గిరిజన సంక్షేమశాఖ మంత్రిదే..

- మంత్రిగా తొలిసంతకమే అమలు చేయలేని వ్యక్తి ఆ పదవికి అర్హురాలా?
- విద్యార్థుల మరణాలపై జాతీయ మానవహక్కుల సంఘానికి, జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాం
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: గిరిజన విద్యార్థులకు ఆరోగ్య భద్రత కల్పించడంలోను, ప్రాణాలు రక్షించడంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న తాడంగి చిన్నారి బుధవారం మృతిచెందిన విషయం తెలుసుకుని దిగ్భ్రాంతికి లోనయ్యారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విద్యార్థి మృతికి ఐదు నిమిషాల పాటు మౌనంపాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు మరణిస్తుంటే గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి బాధ్యత లేదా అని ప్రశ్నించారు. జిల్లాలో ఇప్పటివరకు 15 మంది విద్యార్థులు వివిధ అనారోగ్య కారణాలతో మరణించినా మంత్రికి పట్టకపోవడం విచారకరమన్నారు. కురుపాం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 175 మంది పచ్చకామెర్లతో బాధపడుతూ కురుపాం, పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా సంబంధిత గిరిజన సంక్షేమశాఖ మంత్రికి, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థులు పచ్చకామెర్లతో చనిపోతున్నా, సెరిబ్రల్ మలేరియాతో చనిపోతున్నారని చూపిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల మరణాలపై జాతీయమానవహక్కుల సంఘానికి, జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఢిల్లీలో ఫిర్యాదుచేశామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సాలూరు మండలం కరాసవలసలో సుమారు పదిమంది చనిపోతే నాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఏమిచేయలేని పరిస్థితిలో నేను నా ఎమ్మెల్యే పదవికి రాజినామా చేస్తానని ప్రకటించానని గుర్తుచేశారు.

గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎం పోస్టుల భర్తీచేస్తామని తొలి సంతకం పెట్టారని ఇచ్చిన హామీ ఎంతవరకు అమలుచేయలేదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. మంత్రిగా తొలిసంతకమే అమలుచేయలేని వ్యక్తి, మంత్రి పదవికి అర్హురాలా అని ప్రశ్నించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలల్లో వసతులు, బోధన ప్రమాణాలు, విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని తెలుసుకోవాలని, సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థుల మరణాలపై మౌనం పాటిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, నాయకులు

గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రవికుమార్ డిమాండ్



రవికుమార్

పార్వతీపురం: వరుసగా అనారోగ్యంతో విద్యార్థులు మరణిస్తున్నా పట్టించుకోని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తక్షణమే రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. మక్కువ మండలం ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న తాడంగి చిన్నారిని బతికించుకునేందుకు తల్లిదండ్రులు ఈనెల 13న సాలూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడ నుంచి విజయనగరం, విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. అలాగే, సాలూరు మండల మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వసతి గృహం 7వ తరగతి చదువుతున్న తాడంగి పల్లవి ఈనెల 11న విశాఖపట్నం తరలించినప్పటికీ సెరిబ్రల్ మలేరియాతో మృతి చెందిందన్నారు. కురుపాంలో కలుషిత నీరు కారణంగా సుమారు 224 మంది విద్యార్థులు ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతుండగా ఇద్దరు మృతి చెందారన్నారు. గిరిజనుల ఓట్లతో గెలిచి వారికి కష్టమొస్తే పట్టించుకోని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తక్షణమే విద్యార్థుల మృతికి బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పైడితల్లి హుండీల ఆదాయం రూ.50.13లక్షలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయాన్ని అమ్మవారి కల్యాణ మండపం ఆవరణలో బుధవారం లెక్కించారు. చదురుగుడి హుండీల నుంచి రూ.50 లక్షల13వేల221ల నగదు, 35 గ్రాముల 300 మిల్లీ గ్రాముల బంగారం, 421 గ్రాముల వెండి లభించినట్టు ఇన్‌చార్జి ఈఓ కె.శిరీష తెలిపారు. రామతీర్థం ఈఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సాగిన హుండీల ఆదాయం లెక్కింపులో నూతన ధర్మకర్తల మండలి సభ్యులు తామేశ్వరరావు, గోపాలరావు, ఆనందరావు, వెంకటలక్ష్మి, పద్మావతి, తులసి, కుమారి, స్వాతికుమారి, భక్తులు పాల్గొన్నారు.



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ కె.శిరీష, తదితరులు

ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 'పారిశ్రామిక భాగస్వామ్య డ్రైవ్' ప్రారంభం

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో 'ఏపీఐఐసీ–పారిశ్రామిక భాగస్వామ్య డ్రైవ్' పేరుతో నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఏపీఐఐసీ అధికారులు వారాల వారీగా చేపడుతున్న స్పెషల్ డ్రైవ్‌లో ఈ నెల 21వ తేదీ వరకు పరిశ్రమల ప్రాంగణాల్లో పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు పచ్చదనం పెంపు, ఈ నెల 29 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు పరిశ్రమలతో భాగస్వామ్యం, పెట్టుబడుల ప్రోత్సాహం, నవంబర్ 6 నుంచి 15వ తేదీ వరకు పరిశ్రమల మౌలిక వసతుల ఆధునీకరణ, సుస్థిరత చర్యల అమలు వంటి కార్యక్రమాలను చేపడతారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్ఎం కె.జయచంద్ర, జేసీ వి.రాజేష్ కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

అందని బిల్లులు.. నిలిచిన పనులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మంచినీటి ట్యాంకు రామభద్రపురం మండలం రావివలస పంచాయతీలోని ఎనుబరువు గిరిజన గ్రామంలోనిది. రూ.17.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించారు. 90 శాతం పైగా పనులు పూర్తయ్యాయి. మరో పది శాతం పనులు పూర్తిచేస్తే ఇంటింటికీ తాగునీరు అందుతుందని గ్రామస్తులు సంబర పడ్డారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ చివరిదశలో పనులు నిలిపివేశారు. ఫలితం.. గిరిజనులకు తాగునీరు అందని ద్రాక్షగా మారింది.

రామభద్రపురం: ప్రతీ ఇంటికీ తాగునీరు సరఫరా చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ పనులకు బిల్లుల బకాయిలు గుదిబండగా మారాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 100 పనులకు రూ.40 కోట్ల బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. ఫలితం.. మూడునెలలుగా పనులు జరగడంలేదు. ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

చివరిదశలో నిలిచిన పనులు

చాలా గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు చివరి దశలో నిలిచిపోయాయి. తాగునీటి పథకాల నిర్మాణాలు, బోర్ల ఏర్పాటు పూర్తయినా పైప్‌లైన్ పనులు జరగలేదు. దీంతో ఇంటింటికీ నీటి సరఫరా సాధ్యం కావడంలేదు. తాగునీటి ట్యాంకులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల ట్యాప్‌లు ప్రారంభానికి ముందే పాడవుతున్నాయి.

త్వరలో బిల్లులు చెల్లిస్తాం..

జల్‌జీవన్ మిషన్ బిల్లులు చెల్లించని మాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా సుమారు 100 పనులకు దాదాపు రూ.40 కోట్ల మేర బిల్లులు చెల్లింపుకు సిద్ధం చేశాం. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కూడా చేశాం. త్వరలో బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది. కాంట్రాక్టర్లతో మాట్లాడి చివరిదశలో నిలిచిన పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.కవిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, విజయనగరం

ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

- ఈ నెల 17న ఆర్థిక సాయం అందజేస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు

జియ్యమ్మవలస: కురుపాం బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో పచ్చకామెర్ల వ్యాధితో ఇద్దరు బాలికలు మృతిచెందారని, వారి కుటుంబాలకు ఈ నెల 17వ తేదీన వైఎస్సార్‌సీపీ తరఫున రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన ఆర్థిక సాయాన్ని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు చేతుల మీదుగా అందజేస్తామని చెప్పారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం పార్వతీపురం ఆస్పత్రిలో హెపటైటిస్–ఏతో బాధపడుతున్న గిరిజన విద్యార్థులను పరామర్శిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యేలు కళావతి, అలజంగి జోగారావు పాల్గొంటారని తెలిపారు.

ఆ హాస్టల్ ప్రారంభానికే పరిమితం..!




ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించి అందుబాటులోకి రాని హాస్టల్ భవనం ఇదే..

- ఇదెక్కడి తీరు 'నాయనా'..!
- విద్యార్థులకు అక్కరకు రాని హాస్టల్ భవనం
- ఇంటివద్ద నుంచే రాకపోకలు

బాడంగి: విద్యార్థుల వసతి కోసం హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. దానిని ఇప్పటిరకు అందుబాటులోకి తేలేదు. విద్యార్థులకు వసతి కల్పించలేదు. ఫలితం.. భవనం ప్రారంభించినా ఫలితం లేకపోతోంది. దీనిపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదెక్క తీరు 'నాయనా' అని ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే...

బాడంగి హైస్కూల్‌కు అనుబంధంగా కేజీబీ టైప్–4 హాస్టల్ నూతన భవనాన్ని హడావిడిగా సెప్టెంబర్ 9న ఎమ్మెల్యే బేబీ నాయన చేతులమీదుగా ప్రారంభించారు. ఇప్పటివరకు ఆ భవనం నిర్వహణకు నోచుకోలేదు. వసతి సదుపాయం ఉంటుందన్న ఆశతో సాలూరు, పాచిపెంట తదితర దూరప్రాంతాలనుంచి హైస్కూల్‌లో చేరిన బాలికల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. ఇక్కడకు వచ్చి ఉండేందుకు వసతిలేక ఇంటివద్దనే ఉండిపోతున్నారు. చదువుకు దూరమవుతున్నారు. ఇదే విషయంపై బాడంగి హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా వార్డెన్, ట్యూటర్‌ను ఇచ్చారని, ఇంకా వంటమనిషి, వాచ్‌మన్, శానిటేషన్ వర్కర్లు, స్వీపర్లను నియమించాల్సి ఉందన్నారు. సిబ్బంది నియామకం అయితే వసతిగృహం అందుబాటులోకి వస్తుందన్నారు.

మా పిల్లల పరిస్థితి ఏమిటి?



హాస్టల్ సౌకర్యం ఉంటుందని మా పిల్లల్ని జెడ్పీ హైస్కూల్‌లో చేర్పించాం. జూన్ నెల నుంచి నాలుగునెలలుగా చదువుకు దూరంగా గడుపుతున్నారు. ఇలా అయితే పదోతరగతిలో ఉత్తీర్ణులు ఎలా అవుతారు. త్వరితగతిన వసతిగృహాన్ని ప్రారంభించాలి.

– గొర్కాకుమారి, దళాయి సత్యవతి, బాలికల తల్లులు, సాలూరు

కక్ష సాధింపులు తగవు

విజయనగరం టౌన్: తపాలా శాఖ యూనియన్‌లో ఉన్న నాయకులపై కక్ష సాధింపులను తక్షణమే నిలుపుదల చేయాలని ఆల్ ఇండియా పెన్షన్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రూప్–సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రుద్రప్రతాప్ కోరారు. యూనియన్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ కామ్రేడ్ ఎస్.ఎస్.మహాదేవయ్యను డిపార్ట్‌మెంట్ విధుల నుంచి తొలగించడంపై తపాలాశాఖ కార్యాలయం ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు. తపాలాశాఖలో ట్రేడ్ యూనియన్ హక్కులను పరిరక్షించాలన్నారు. యూనియన్‌ల గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.కిరణ్ కుమార్, ఎ.పెంటపాపయ్య, వి.శ్రీనివాసరావు, పతివాడ శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



తపాలాశాఖ కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

క్లుప్తంగా

రీల్స్ విజేతలకు బహుమతులు

• కలెక్టర్ డా.ఎన్. ప్రభాకరరెడ్డి



విజేతల వివరాలను వెల్లడిస్తున్న కలెక్టర్ డా.ఎన్ ప్రభాకరరెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ఉత్తమ వీడియో రీల్స్ రూపొందించిన ఐదుగురు విజేతలకు కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి నగదు బహుమతులను ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన 48 వీడియోల నుంచి వారిని ఎంపిక చేసినట్లు ఆయన బుధవారం తెలిపారు. విజేతలలో పార్వతీపురానికి చెందిన మర్రి రవికి ప్రథమ బహుమతి(రూ. 5,000), సాలూరు మండలానికి చెందిన కోన మహేష్‌కు ద్వితీయ(రూ. 3,000), బహుమతి, సీతంపేటకు చెందిన కె.టెండూల్కర్‌కు తృతీయ (రూ.2,000) బహుమతి లభించాయి. అలాగే, మహతో ఇంద్రాణికి కన్సొలేషన్ బహుమతి, పట్టాభి అనిల్ కుమార్‌కు సోషల్ మీడియా అంబాసిడర్‌గా ప్రత్యేక పురస్కారం దక్కింది. త్వరలోనే వారికి బహుమతి ప్రదానం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్ఓ కె.హేమలత పాల్గొన్నారు.

19న అండర్-13 చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 19న అండర్-13 విభాగంలో బాలబాలికలకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం అధ్యక్షుడు కేకే జగన్నాథ్ బుధవారం తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోలింగ్ ట్రోఫీలో భాగంగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ట్రోఫీలో భాగంగా అండర్ -7 నుంచి అండర్ -19 విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయని వెల్లడించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు క్రీడాకారులకు తుది దశ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు ఫోన్ 74166 66567 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్ట్



గంజాయి నిందితులతో జీఆర్పీ ఎస్సై బాలాజీరావు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: మూడు కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను విజయనగరం జీఆర్పీ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జీఆర్పీ ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ సిబ్బంది, విజయనగరం జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా పార్వతీపురం నుంచి విజయనగరం వస్తున్న ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా కేరళ రాష్ట్రంలోని అల్పుజ జిల్లాకు చెందిన సుని, గోవిందరాజులు ఒడిశాలోని మునిగూడ నుంచి కేరళకు అక్రమంగా 3 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ సందర్భంగా బలిజిపేట పోలీసులు ఆ ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని జీఆర్పీకి అప్పగించారు. జీఆర్పీ ఎస్సై బాలాజీరావు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ నిమిత్తం రైల్వే కోర్టుకు తరలించారు.

చంపావతిలో వ్యక్తి గల్లంతు



కనకల అప్పారావు

నెల్లిమర్ల: స్థానిక చంపావతి నదిలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. దీనిపై బుధవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జరజాపు పేటకు చెందిన కనకల అప్పారావు (46) భవన నిర్మాణ పనులు చేస్తూ పని లేని సమయంలో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు వంటలు చేయడానికి వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో థామస్ పేట గ్రౌండ్‌లో పెళ్లి ఫంక్షన్ వంటకు సహచరుడు కిల్లంపల్లి రాజుతో వెళ్లి వంట పూర్తయిన తరువాత ఇద్దరూ చంపావతి నదిలో స్నానికి దిగారు. రాజు ఒడ్డుకు చేరుకోగా అప్పారావు గల్లంతయ్యాడు. కాగా ఆ ప్రదేశంలో లోతుతో పాటు ఊబి కూడా ఉండడంతో గల్లంతవడంతో స్థానికులు, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది దిగి వెతికినా అప్పారావు ఆచూకీ లభ్యం కాలేదు. అప్పారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్‌డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹274

మత్తులో ఉంచి వైద్యం

• వైద్యరంగంలో అధిక ప్రాధాన్యం
• ఏడాదిలో లక్ష మంది వరకు రోగులకు ఎనస్థీషియా
• నేడు ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవం



శస్త్రచికిత్సలో పాల్గొన్న మత్తు వైద్యులు

విజయనగరం ఫోర్ట్: వైద్యరంగంలో కొన్నేళ్ల క్రితం వరకు మత్తు వైద్యుల గురించి ప్రజలకు పెద్దగా తెలియదు. కోవిడ్ మహమ్మారి తీవ్రస్థాయిలో విజృంభిస్తున్న సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న కోవిడ్ రోగులకు చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడడంతో మత్తు వైద్యులకు గుర్తింపు వచ్చింది. సమాజంలో మత్తు వైద్యులు అంటూ ఉన్నారన్న విషయం అందరికీ తెలిసింది. గురువారం ప్రపంచ మత్తు వైద్య దినోత్సవం (వరల్డ్ ఎనస్థీషియా డే) సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. పూర్వ కాలంలో తలమీద, ముక్కు దగ్గర మూలికలు పెట్టి మత్తు వచ్చేలా చేసి చికిత్స అందించేవారు. గతంలో మత్తు వైద్యవిద్యను అభ్యసించడానికి పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. మత్తు వైద్యులు కూడా చాలా తక్కువగా ఉండేవారు. మత్తు విభాగంలో ఆధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో ఇటీవల మత్తు వైద్యవిద్యను అభ్యసించే వారి సంఖ్య పెరుగుతోంది. మత్తు వైద్యులకు ప్రాధాన్యం పెరిగింది. ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు నిలబెట్టడంలో మత్తు వైద్యులు కీలక పాత్ర పోషిస్తారు.

శస్త్రచికిత్సలో కీలక పాత్ర

ఏదైనా వ్యాధికి శస్త్రచికిత్స చేయాలంటే మత్తు వైద్యులదే కీలక పాత్ర. సంబంధిత వ్యాధికి ఎంత మోతాదులో మత్తు ఇవ్వాలో అంతే మత్తు ఇవ్వాల్సి ఉంటుంది. మోతాదుకు మించి మత్తు ఇచ్చినట్లయితే రోగి ప్రాణాల మీదకు వస్తుంది. ఎముకల సంబంధిత, ఈఎన్‌టీ, గైనిక్, డెంటల్ శస్త్రచికిత్సలకు, కడుపునొప్పి, అపెండిసైటిస్, పేగుఒరుపు, హెర్నియా, హైడ్రాసిల్, ఫైల్స్, కేన్సర్, న్యూరోసర్జరీ, గుండె సంబంధిత శస్త్రచికిత్సలకు మత్తు ఇస్తారు. ముఖ్యంగా గుండె మార్పిడి, కాలేయం మార్పిడి, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో మత్తు వైద్యుల పాత్ర అత్యంత కీలకం. ఈ శస్త్రచికిత్సలు చేసేటప్పుడు ప్రతి సెకను గుండె ప్రతి స్పందనను గమనిస్తూ మత్తు వైద్యులు ఉండాలి. అదేవిధంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నవారికి, పురుగు మందు తాగి క్లిష్టపరిస్థితుల్లో ఉన్న వారికి కూడా మత్తు వైద్యులు మత్తు ఇచ్చి చికిత్స అందిస్తారు. వెంటిలేటర్‌పై ఉన్న రోగులకు, ఐసీయూ నిర్వహణ కూడా మత్తు వైద్యులే చూస్తారు.

జిల్లాలో విధుల్లో 100 మంది వైద్యులు

గతంలో మత్తు వైద్యులు తక్కువగా ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య పెరిగింది. జిల్లాలో 100 మంది వరకు మత్తు వైద్యులు ఉన్నారు. వారిలో 70 నుంచి 80 మంది ప్రాక్టీస్ చేస్తున్నారు. సర్వజన ఆస్పత్రిలోనే ఏడాదికి 12 వేల మంది వరకు రోగులకు మత్తు ఇస్తారు. జిల్లావ్యాప్తంగా ఏడాదికి లక్ష మంది వరకు రోగులకు మత్తు ఇస్తారు.

మత్తు వైద్యులకు గుర్తింపు వచ్చింది:



గతంలో మత్తు వైద్యులకు అంత ప్రాధాన్యం ఉండేది కాదు. తెరవెనుకనే వారి పాత్ర ఉండేది. కోవిడ్ రోగులకు సేవలు అందించిన తర్వాత మత్తు వైద్యులకు ప్రాధాన్యం, గుర్తింపు వచ్చింది. గతంలో మత్తు వైద్యులుగా చేయడానికి చాలా మంది వెనుకాడేవారు. రోగికి ఏదైనా అయితే నిందిస్తారేమోనని ముందుకు వచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు మంచి పరికరాలు అందుబాటులోకి రావడం వల్ల మత్తు వైద్యుల పని సులభతరమైంది. మత్తు ఇవ్వడం కష్టతరమైన పని అయినప్పటికీ రోగుల ప్రాణాలు కాపాడామనే సంతృప్తి ఉంటుంది.

డాక్టర్ డి.జయధీర్‌బాబు, ప్రొఫెసర్, మత్తు విభాగం అధిపతి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

వైద్యవిద్య వ్యాపారం కాదు!



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వ బాధ్యతలు వదిలేసి వైద్యవిద్యా వ్యవస్థను వ్యాపారుల చేతుల్లోకి నెట్టొద్దని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు బుధవారం జెడ్పీ మినిస్టీరియల్ భవనంలో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు యూ.ఎస్. రవికుమార్ అధ్యక్షతన ప్రజా సంఘాల ప్రతినిధులు, వైద్యులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైద్య రంగాన్ని పీపీపీ మోడల్ పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులతో స్థాపించిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం పేద విద్యార్థులకు, ప్రజారోగ్యానికి భారీ దెబ్బ పడుతుందని పేర్కొన్నారు. వైద్యవిద్య ఫీజులు ఆకాశాన్నంటుతాయని, పేద విద్యార్థులకు డాక్టర్ కావాలనే కల దూరమవుతుందని, రిజర్వేషన్లు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడం వల్ల పేదలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. గ్రామీణ పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, నాగమనోహర్, ఫైజల్, సురేష్ బాబు, రాజగోపాల్, వెంకటరావు, దివాకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో 'హెల్త్ ఎమర్జెన్సీ' ప్రకటించాలి

• ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వరుస మరణాలు ఆందోళనకరమని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దారుణాలు జరుగుతున్నాయని, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మువ్వల అమర్‌నాథ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి మెనూ సక్రమంగా అమలు చేయకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడం, అపరిశుభ్ర వాతావరణం, సిబ్బంది లేమి వంటి కారణాలతో హాస్టళ్లలో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారన్నారు. రెండేళ్ల క్రితం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రతి హాస్టల్‌కు ఒక ఏఎన్‌ఎంను నియమించి ఉంటే ఈ మరణాలు సంభవించేవి కావన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని, ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను సేకరించి, పౌష్టికాహారంతో కూడిన కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైతే, విద్యార్థుల మరణాలను ప్రభుత్వ హత్యలుగానే పరిగణిస్తామని అమర్‌నాథ్ తీవ్రంగా హెచ్చరించారు.

గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలి

• కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: పీఎంఏవై పథకం కింద మంజూరైన గృహాలను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పీఎంఏవై కింద జిల్లాలో 8,259 గృహాలు లక్ష్యం కాగా 6,873 గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన 1,386 గృహాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముందుగా అర్బన్‌లో సొంత స్థలాలు ఉన్న వారి గృహాలను పూర్తి చేయాలన్నారు. రూఫ్ లెవెల్‌లో ఆర్‌సీ స్థాయిలో ఉన్నవి పూర్తి కావాలని ఇకపై ప్రతి వారం సమీక్షించనున్నట్లు తెలిపారు. కాలనీలలో నిర్మాణాలకు అనువుగా ఉన్న వాటిని గుర్తించి అందుకు ఎంతమేరకు భూమి అవసరం అవుతుందో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ మురళీ ప్రసాద్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రహదారులపై చెత్త కనిపించరాదు

• కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డి

పార్వతీపురం రూరల్: పార్వతీపురం, సాలూరు పట్టణంలోని రహదారులు శుభ్రంగా ఉండాలని, ఎక్కడా చెత్త కనిపించరాదని కలెక్టర్ డా.ఎన్ ప్రభాకర రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ప్రతి వార్డులో పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని సూచించారు. నిరంతరాయంగా తాగునీటి సరఫరా చేయాలని, పరిపాలనలో పూర్తిస్థాయి 'ఈ-ఆఫీసు' విధానం అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ ఆదా కోసం సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని, రోడ్లపై నిరుపయోగంగా ఉన్న వాహనాలను తొలగించాలని ఆదేశించారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

• జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మజ

విజయనగరం ఫోర్ట్: అత్యవసర సమయాల్లో ప్రాణాలను రక్షించే సీపీఆర్ గురించి ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బుధవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కారణాల రీత్యా ఒక వ్యక్తి గుండె కొట్టుకోవడం, శ్వాస ఆగిపోయినప్పుడు అతని ప్రాణాలు రక్షించడానికి సీపీఆర్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మత్తు విభాగం అధిపతి డాక్టర్ జయధీర్‌బాబు, అత్యవసర విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శివప్రసాద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శివ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో పుష్యమి నక్షత్రం సందర్భంగా పూర్ణాహుతి హోమాన్ని ఆలయ అర్చకులు బుధవారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామిని ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక సర్గ హవనం విన్నవించి పూర్ణాహుతి చేపట్టారు. తరువాత వెండి మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై దాడి



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన కాపీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీకి సానుభూతి పరులు, తండ్రీకొడుకులైన అలమండ సత్యం, అలమండ నారాయణరావులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ కుటుంబ సభ్యులు మీసాల సూర్యనారాయణ, నాగమణి వారి కుమారుడు సాగర్‌తో పాటు మంత్రి అప్పలనాయుడు, బొద్దాన రాము అన్యాయంగా దాడి చేశారు. ఈ మేరకు బాధితులు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ బూడి శ్రీరాములునాయుడుతో కలిసి విజయనగరం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్‌తో వెళ్తున్న తన కుమారుడు అలమండ నారాయణరావును అడ్డుకుని తొలుత దాడి చేశారని, కుమారుడు తప్పించుకుని పారిపోగా, పొలంలో పని చేస్తున్న తనను ఇంటికి తీసుకువచ్చి బంధించి విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారని తండ్రి అలమండ సత్యం ఫిర్యాదు చేశాడు. టీడీపీ మాజీ ఎంపీటీసీ ఇంటిలో బందీగా ఉన్న తనను పోలీసులు వచ్చి విడిపించగా చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేయించుకున్నానని, పోలీసులు ఆస్పత్రిలో వివరాలు తీసుకుని కేసు నమోదు చేశారని తెలిపారు. పాత కక్షలతో ప్రణాళిక ప్రకారం తండ్రీకొడుకులైన తమపై దాడి చేసి గాయపరిచారని, గ్రామంలో ఎలా తిరుగుతారో చూస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్టీసీ ఈడీ దృష్టికి ఉద్యోగుల సమస్యలు



వినతిపత్రాన్ని అందుకుంటున్న విజయనగరం జోనల్ ఈడీ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి

విజయనగరం అర్బన్: ఆర్టీసీ విజయనగరం జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి దృష్టికి విజయనగరం జోన్ పరిధిలో ఉన్న ఉద్యోగుల సమస్యలను ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కమిటీ తీసుకెళ్లింది. ఈ మేరకు బుధవారం సంఘం ప్రతినిధులు స్థానిక జోనల్ ట్రెనింగ్ కాలేజీ సమావేశ మందిరంలో ఆయనను కలిసి తమ సమస్యల పత్రాన్ని అందజేశారు. జోన్ పరిధిలోని 6 జిల్లాలు, 19 డిపోలు, జోనల్ వర్క్‌షాప్‌లకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి బస్సుల్లో డ్రైవర్లు, కండక్టర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. జోన్‌లో ప్రమోషన్లు ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని, రన్నింగ్ టైమ్ తగినవిధంగా లేవని, రికవరీలు, రెస్ట్ రూమ్‌లు, డ్యూటీ చార్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాడేరు డిపోలో నివాస గృహాల అద్దె సమస్య, టీమ్ రికవరీలు, రెస్ట్ రూమ్‌లు, డ్యూటీ చార్టులు వంటి పలు సమస్యలు ఉన్నాయిని వినతిపత్రంలో తెలియజేశారు. కొన్ని జిల్లాల్లో అక్రమంగా ఇస్తున్న ఓడీలు, ఉద్యోగుల సీనియార్టీలో తేడాలు, రూట్ సర్వేలు, మంచినీటి సదుపాయాలు, ఇంక్రిమెంట్లు లభించకపోవడం వంటి 30కు పైగా సమస్యలను వినతిపత్రంలో వివరించారు. ఈడీని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వెంకటరావు, జోనల్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జోనల్ కార్యదర్శి బీకేమూర్తి, జోనల్ కోశాధికారి కేఎస్ఎస్‌మూర్తి, జిల్లా కార్యదర్శి రవికాంత్ ఉన్నారు.

'శౌర్యం స్మృతి' బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ దామోదర్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత, యాంకర్ నాగరాజు

విజయనగరం క్రైమ్: పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవం సందర్భంగా, విజయనగరం జిల్లా పోలీసు డివిజన్ పరిధిలో పోలీస్ శాఖ చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో 'శౌర్యం' (తెలుగు) 'స్మృతి' (ఆంగ్లం) పేరుతో రూపొందించిన అమరవీరుల స్మారక బ్రోచర్లను ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 'అమరవీరుల సేవా తపస్సుకు ఈ సాహిత్య నివాళి ప్రతి పోలీసు సిబ్బందిలో ధైర్య స్ఫూర్తిని నూరిపోస్తుందన్నారు. అమరవీరుల కుటుంబాలకు గౌరవాన్ని చాటుతుందని చెప్పారు. ఈ ప్రయత్నం రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాస్థాయి పోలీసు విభాగం ఆధ్వర్యంలో అధికారికంగా ప్రారంభం కావడం విశేషమన్నారు.. భవిష్యత్‌లో ఇది తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ప్రేరణారూపంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ప్రముఖ యాంకర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్ బైకులే టార్గెట్

• ముగ్గురు బైక్ దొంగల అరెస్టు
• రూ.14 లక్షలు విలువ చేసే ఏడు బుల్లెట్ బైక్‌లు చోరీ
• వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ శ్రీనివాసరావు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం రూరల్: జల్సాలకు అలవాటు పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించాలని మార్గాలు వెతికారు. బైక్ హ్యాండిల్ లాక్‌లను అన్‌లాక్ చేయడం నేర్చుకున్నారు. బైక్‌లను దొంగిలించి తక్కువ ధరకు అమ్మడం అలవాటు చేసుకున్నారు. ఆఖరకు పోలీసుల చేతికి చిక్కారు. బుధవారం రూరల్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు కేసు వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం రూరల్ పరిసర ప్రాంతంలో 5 బుల్లెట్ బైక్‌లు, ఆమదాలవలస ప్రాంతంలో 2 బుల్లెట్ బైక్‌లు పోయినట్లు రూరల్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. రెండు రోజుల కిందట రాగోలు దూసి ప్రాంతంలో రూరల్ ఎస్ఐ రాము వాహనాలు తనిఖీలు చేస్తుండగా రెండు బుల్లెట్లపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా వ్యవహరించడంతో ఆరా తీశామని, అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

ఖరీదైన వాహనాలే ఆదాయ వనరులు..

బుల్లెట్ దొంగతనాలకు పాల్పడిన ఎ-1 దండు రిషివర్ధన్ స్వస్థలం విశాఖపట్నం. విశాఖ కమిషనరేట్‌లో పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో ఓ వివాహిత హత్య కేసులో ప్రధాన నిందితుడు. పార్వతీపురం రూరల్ పోలీస్టేషన్‌లో ఒక చీటింగ్ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఎ-2 రాయిపల్లి వినోద్ స్వస్థలం సాలూరు కాగా.. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఐదు సారా కేసులు, సాలూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌తో పాటు గంట్యాడ పోలీస్‌స్టేషన్‌లో ఒక డెకాయిటీ కేసు, అలాగే పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసులతో పాటు ఏడు కేసులు నమోదై ఉన్నాయి. ఇతనిపై పార్వతీపురం జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ కూడా ఓపెన్ చేశారు.

జైలులో పరిచయం..

దండు రిషివర్ధన్, రాయిపల్లి వినోద్‌లు ఇద్దరూ జైలులో ఒకరికి ఒకరు పరిచయమయ్యారు. విలువైన బైక్‌లు దొంగతనం చేసి నంబర్ మారిస్తే ఎవరూ పట్టుకోలేరని ప్లాన్లు గీశారు. గడిచిన మూడు నెలలుగా ఏడు బైక్‌లు దొంగిలించారు. దొంగిలించిన బైక్‌లను మూడో నిందితుడు, బైక్ మెకానిక్ కొత్తూరుకు చెందిన చిట్టి సంతోష్ సెకండ్ హ్యాండ్ బైక్ షోరూమ్ నిర్వాహకుడి సాయంతో విక్రయించారు. వీరి వద్ద నుంచి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు బాబురావు, నారాయణరావు, సురేష్, కృష్ణ కానిస్టేబుల్స్‌కు ఎస్పీ మహేశ్వరరెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందించారు. సమావేశంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపు నాయుడు, ఎస్ఐ రాము పాల్గొన్నారు.

గెడ్డలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం



సోమరాజు (ఫైల్)



సోమరాజు మృతదేహం

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట, వసంత గ్రామాల మధ్య ఉన్న గెడ్డలో కొట్టుకుపోయిన ఆర్.వసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు(54) మృతదేహం బుధవారం లభ్యమైంది. విజయనగరంలోని పీడబ్ల్యూ మార్కెట్‌లో కిరాణా హోల్‌సేల్ దుకాణంలో విధులు ముగించుకుని సోమవారం రాత్రి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వసంత గ్రామానికి సోమరాజు వెళ్తుండగా చంద్రంపేట దాటిన తర్వాత గెడ్డ దాటుతూ కొట్టుకుపోయాడు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి మంగళవారం గాలింపు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో గెడ్డలో మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వసర్వజన ఆస్పత్రికి పోలీసులు తరలించారు.